క్లుప్తంగా

గుంతను పూడ్చిన లారీ డ్రైవర్



మరిపెడ రూరల్: తరచూ ప్రమాదాలకు నెలవుగా మారిన నేషనల్ హైవే పై గుంతను ఓ లారీ డ్రైవర్ పూడ్చాడు. మట్టిపోసి గుంతను పూడ్చిన డ్రైవర్ శ్రీనును పలువురు అభినందిస్తున్నారు. వివరాలిలా ఉన్నాయి.. మరిపెడ మండల కేంద్రం శివారు ఖమ్మం వైపుగా వెళ్లే కాకతీయ కళాతోరణం సమీపంలో వరంగల్–ఖమ్మం 563 జాతీయ రహదారిపై మధ్యలో లోతైన గుంత ఏర్పడింది. ఈ గుంత కారణంగా పలువురు ప్రమాదాలకు గురై గాయపడ్డారు. దీంతో లారీ డ్రైవర్ శ్రీను మట్టితో గుంతను పూడ్చాడు.

ఎస్సీ బాలికల హాస్టల్ పరిశీలన



కురవి: మండల ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో ఆదివారం కురవిలోని ఎస్సీ బాలికల హాస్టల్‌ను నాయకులు సందర్శించి పరిశీలించారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి విద్యార్థినులతో కలసి భోజనం చేశారు. ఈసందర్భంగా సంఘం మండల కార్యదర్శి కొలిపాక వీరేందర్ మాట్లాడుతూ.. ఎస్సీ బాలికల వసతి గృహానికి సొంత భవనాన్ని నిర్మించాలని డిమాండ్ చేశారు. గణేశ్, మహేశ్, వినోద్, ఉష పాల్గొన్నారు.

బాలికల చదువుతో సమాజం అభివృద్ధి



మరిపెడ రూరల్: బాలికల చదువుతోనే సమాజం, దేశం అభివృద్ధి చెందుతుందని మత పెద్దలు మౌలానా అమ్మర్ అబిద్ అన్నారు. ఆదివారం మరిపెడ మండల కేంద్రం హౌసింగ్ బోర్డు శివారులో ఉన్న మదర్సా–యే–ఇస్లావియా రౌజాతుల్ బనాత్ బాలికల అరబ్బీ పాఠశాల మదర్సాలో 'దీని ఇల్మ్' పై అవగాహన సదస్సు జరిగింది. ఈ సదస్సుకు ముఖ్యఅతిథిగా మత పెద్దలు మౌలానా అమ్మర్ అబిద్ పాల్గొని ప్రసంగించారు. మదర్సా వైస్ ప్రిన్సిపాల్ హఫీజ్ సాజిద్ ఖునాన్ పూర్తి చేసిన విద్యార్థినులకు బహుమతులు ప్రదానం చేశాడు.

'ఎర్రబెల్లి విమర్శలు హాస్యాస్పదం'

తొర్రూరు: ఓటమిని జీర్ణించుకోలేక మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పాలకుర్తి ఎమ్మెల్యేపై బురద చల్లుతున్నాడని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సుంచు సంతోష్ అన్నారు. ఆదివారం డివిజన్ కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. సంతోష్ మాట్లాడుతూ ఎమ్మెల్యే యశస్విని రెడ్డి, కాంగ్రెస్ ఇన్‌చార్జ్ ఝాన్సీరెడ్డిలు పాలకుర్తి నియోజకవర్గ అభివృద్ధికి పాటుపడుతుంటే, వారికి మంచిపేరు రావొద్దని దయాకర్ రావు కుట్రలు పన్నుతున్నాడన్నారు. కాలువల్లో నీళ్లు రావడం లేదని మొసలి కన్నీరు కార్చడం సరికాదని, కాలువల్లో నీరు వదిలేందుకు ఎమ్మెల్యే ప్రభుత్వంతో మాట్లాడిందని గుర్తు చేశారు. నాయకులు జాటోతు రవి నాయక్, బచ్చలి లక్ష్మణ్, వెంకటాచారి, అభిరాంనాయక్, మహేశ్‌యాదవ్, సోమిరెడ్డి పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణకు సహకరించాలి

తొర్రూరు రూరల్: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు అన్ని రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు, యువకులు, అన్నివర్గాల ప్రజలు సహకరించాలని ఎస్సై ఉపేందర్ అన్నారు. త్వరలో జరగనున్న పంచాయతీ, ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల నిర్వహణపై ఆదివారం మండలంలోని వెలికట్ట గ్రామంలో అవగాహన కార్యక్రమాన్ని పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ఎన్నికల కోడ్‌ను ఎవరైనా అతిక్రమిస్తే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

'కలెక్టర్‌ను బదిలీ చేయాలి'

మహబూబాబాద్ అర్బన్: జిల్లాలో అడ్మినిస్ట్రేషన్ చేయలేని, విధులపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ అధికా రులపై చర్యలు తీసుకోలేని జిల్లా కలెక్టర్‌ను వెంటనే బదిలీ చేయాలని ఎల్‌హెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు బోడ రమేశ్‌నాయక్ అన్నారు. జాతీయ ఎస్టీ కమిష న్ సభ్యులు జాటోత్ హుస్సేన్‌నాయక్‌ను ఎల్‌హెచ్‌పీఎస్ సంఘం ఆధ్వర్యంలో కలెక్టర్‌ను బదిలీ చేయాలని కోరుతూ వినతిపత్రాన్ని ఆదివారం అందజేశారు. హత్తిరాంనాయక్, వీరన్న, శంకర్, చంద్రు, దేనియా, చంద్రు పాల్గొన్నారు.

రోడ్డెక్కుతున్న రేగుముళ్లు..!

- రహదారిని ఇరువైపులా కమ్మేస్తున్న రేగుచెట్లు
- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు

గార్ల: గార్ల నుంచి మహబూబాబాద్ వెళ్లే డబుల్ బీటీ రహదారికి ఇరువైపులా రేగిముళ్ల చెట్లు అల్లుకుపోవడంతో డబుల్ రోడ్ కాస్తా సింగిల్ రోడ్‌గా మారింది. రేగుముళ్ల రోడ్డుపైకి వస్తుండడంతో ప్రజలు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండలంలోని అంజనాపురం నుంచి దుబ్బగూడెం వెళ్లే గ్రామాల మధ్య బీటీ రహదారికి ఇరువైపులా ముళ్లపొదలు కమ్మేస్తుండడంతో ఇబ్బందులు పడుతున్నామని సంబంధిత అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.



రోడ్డును కమ్మేస్తున్న రేగుచెట్లు

వెంటనే తొలగించాలి



బీటీ రహదారికి ఇరువైపులా పెరిగిన రేగికంప ముళ్లపొదలను సంబంధిత అధికారులు తొలగించాలి. ఇలాగే ఉంటే రోడ్డు ప్రమాదాలను ఎక్కువ అవుతాయి. ముళ్లపొదలు పెరగడంతో డబుల్‌రోడ్డు బీటీ రహదారి సింగిల్ రోడ్‌గా మారింది.

– గంగావత్ లక్ష్మణ్‌నాయక్, గార్ల

పీఆర్టీయూ బలోపేతానికి కృషి

- జిల్లా ప్రధాన కార్యదర్శి సతీష్‌రెడ్డి

పెద్దవంగర/దంతాలపల్లి/నెల్లికుదురు: ఉపాధ్యాయుల సంక్షేమానికి పాటుపడుతున్న పీఆర్టీయూ బలోపేతానికి ప్రతీ సభ్యుడు కృషి చేయాలని పీఆర్టీయూ టీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మిర్యాల సతీష్‌రెడ్డి కోరారు. ఆదివారం పీఆర్టీయూ ఆవిర్భావం దినోత్సవాన్ని పెద్దవంగర, దంతాలపల్లి, నెల్లికుదురు మండలాల్లో నిర్వహించారు. సంఘం పతకాన్ని అధ్యక్షుడు గంగిశెట్టి రమేష్ ఆవిష్కరించారు. వ్యవస్థాపక అధ్యక్షుడు సామల యాదగిరి చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం పలువురు మాట్లాడారు. 1971లో పీఆర్టీయూ ఏర్పడిన నాటినుంచి ఉపాధ్యాయ, విద్యారంగా సమస్యలు పరిష్కరిస్తూ సభ్యత్వంలో అతిపెద్ద సంఘంగా ఆవిర్భవించిందన్నారు. ఎమెల్సీ ఎన్నికల్లో పింగిలి శ్రీపాల్ రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటువేసి గెలిపించాలని కోరారు. ఆయా కార్యక్రమాల్లో దంతాలపల్లి మండల మండలశాఖ అధ్యక్షుడు రాగిరి చంద్రశేఖర్, వెలిదే సురేష్ కుమార్, శ్రీధర్‌రెడ్డి, యాకుబ్ పాషా, శ్రీధర్, మధుకర్‌రెడ్డి, కృష్ణ, శంకరయ్య, రఘు, మహిపాల్‌రెడ్డి, నెల్లికుదురు మండలంలో రిటైర్డ్ పీడి గొట్టిముక్కుల యాకిరెడ్డిని శాలువాలతో సన్మానించారు. నర్సింహరెడ్డి, లక్ష్మణ్ పాల్గొన్నారు.



దంతాలపల్లిలో జెండాను ఎగురవేస్తున్న చంద్రశేఖర్

ప్రతి ఎకరాకు నీరందించడమే లక్ష్యం

- ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్

కేసముద్రం: ప్రతి ఎకరాకు నీరందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని మహబూబాబాద్ ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ అన్నారు. ఎస్సారెస్పీ జలాలు కాలువల్లో మట్టి పేరుకుపోవడంతోపాటు, వట్టివాగులో చుక్క నీరు లేక ఇబ్బందులు తలెత్తుతున్నాయంటూ పలువురు రైతులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ఈ మేరకు స్పందించిన ఎమ్మెల్యే మురళీనాయక్ ఆదివారం మండల కేంద్రంలోని ఎస్సారెస్పీ కాలువలతోపాటు, వరంగల్ జిల్లా తీగరాజుపల్లి వద్ద డీబీఎం 48 ఎస్సారెస్పీ కాలువ, తిమ్మాపురం, సీతారాంపురం, ఎలుగూరు చెరువులను పరిశీలించారు. ఈ మేరకు ఎలుగూరు చెరువును నింపి అక్కడి నుంచి మానుకోట నియోజకవర్గంలోని వట్టివాగులోకి ఎస్సారెస్పీ జలాలు వచ్చేవిధంగా చూడాలని ఈఈ నారాయణకు సూచించారు. అనంతరం కేసముద్రంలోని సప్పిడిగుట్ట వద్ద డీబీఎం 48 ఎస్సారెస్పీ కాలువను పరిశీలించి గేట్లు మూసివేయకుండా కేసముద్రంస్టేషన్ పెద్దాయిచెరువు, వెంకటగిరి చెరువును నింపి, వట్టివాగులోకి నీళ్లు చేరే విధంగా చూడాలన్నారు. సంజీవరెడ్డి, మహేందర్‌రెడ్డి, నాగేశ్వర్‌రావు, మురళి, దస్రూనాయక్, వెంకన్న, దయాకర్, తదితరులు పాల్గొన్నారు.



కాల్వను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మురళీనాయక్

పోరాటాలతోనే హామీల అమలు

- న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు

గార్ల: ఎన్నికల హామీల అమలు కోసం ప్రజాపోరాటాలే శరణ్యమని న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు జడ సత్యనారాయణ, సక్రు పిలుపునిచ్చారు. మండలంలోని ఇందిరానగర్, చిన్నకిష్టాపురం గ్రామాల్లో ఎన్నికల హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఎన్‌డీ పార్టీ నాయకులు విస్తృత ప్రచారం నిర్వహించారు. ఎన్నికల్లో గెలిస్తే 100 రోజుల్లో ఆరు గ్యారంటీలు అమలు చేస్తామని హామీలు ఇచ్చిందని, అధికారం చేపట్టి 14 నెలలు గడుస్తున్నా రాష్ట్రంలో హామీలు అమలు చేయడంలో ప్రభుత్వం ఘోరంగా వైఫల్యం చెందిందని ఆరోపించారు. ఎన్నికల హామీలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 20న చలో హైదరాబాద్ కార్యక్రమంలో ఎన్‌డీ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. పీవైఎల్ రాష్ట్ర కార్యదర్శి బోనగిరి మధు, పి వెంకటేశ్వర్లు, బి రాధ, అనసూయ, భారతి, యాకన్న, జి వీరు, బాలు, శ్రీను, అచ్చమ్మ, సునీత, శంకర్, తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా.. సత్యనారాయణపురం మాజీ సర్పంచ్ బాదావత్ రాందాస్‌తోపాటు పలు కుటుంబాలు న్యూడెమోక్రసీ పార్టీలో చేరాయి.



ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు

యోగాతో మానసిక ప్రశాంతత

కురవి: యోగాతో మానసిక ప్రశాంతత ఏర్పడుతుందని శ్రీరామ ట్రస్ట్ అధినేత డాక్టర్ మాధవి అన్నారు. ఆదివారం సీరోలు మండల కేంద్రంలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాల/కళాశాలలో రెండు రోజులపాటు సంకల్ప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో యోగా శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తారు. ఆదివారం మొదటి రోజు శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభి ఆమె మాట్లాడుతూ.. ప్రతీ ఒక్కరికి యోగ చేయడం ఎంతో అవసరమన్నారు. మానసిక ఉల్లాసం, ప్రశాంతత, ఆరోగ్యం బాగుంటుందని తెలిపారు. వయస్సుతో సంబంధం లేకుండా యోగా నేర్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సంకల్ప్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు హర్షవర్ధన్‌రెడ్డి, మాజీ సర్పంచ్ శ్యామల రంగమ్మ, ప్రిన్సిపాల్ సంతోష్‌సోను, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులకు యోగా నేర్పుతున్న డాక్టర్ మాధవి

అఖిల భారత సదస్సును జయప్రదం చేయండి




కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

నెహ్రూసెంటర్: కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ ఆధ్వర్యంలో ఈ నెల 28వ తేదీన ఢిల్లీలో జరిగే అఖిల భారత సదస్సును జయప్రదం చేయాలని పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి కొత్తపల్లి రవి అన్నారు. జిల్లా కేంద్రంలో సదస్సు కరపత్రాలను ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కేంద్రంలో మోదీ అధికారంలోకి వచ్చిన తర్వాత కార్పొరేట్ కంపెనీలు, దిగ్గజాల ఆస్తులు పెరుగుతున్నాయని అన్నారు. దేశం ఎదుర్కొంటున్న సమస్యలను సదస్సులో చర్చించి భవిష్యత్ కార్యచరణ రూపొందించనున్నట్లు వారు పేర్కొన్నారు. ఈ నెల 10వ తేదీ నుంచిజ 25 వరకు పార్టీ ఆధ్వర్యంలో గ్రామ గ్రామాన సభలు, సమావేశాలు నిర్వహించి కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లో చర్చపెట్టాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బిల్లకంటి సూర్యం, కందాల రంగయ్య, యాకయ్య, రాజు, వెంకన్న, సతీష్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిభావం పెంపొందించుకోవాలి


తొర్రూరు రూరల్: జగద్గురు గీతా ఆశ్రమంలో కొనసాగుతున్న ఉత్సవాల్లో అన్నివర్గాల ప్రజలు పాల్గొని భక్తిభావం పెంపొందించుకోవాలని చీరాల చెందిన ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచకులు ప్రణవానందస్వామి అన్నారు. మండలంలోని వెలికట్ట గ్రామ శివారులోని గీతా ఆశ్రమంలో రెండో రోజు ఉత్సవాల్లో కొనసాగాయి. ఈ సందర్భంగా ప్రణవానందస్వామి మాట్లాడుతూ జ్ఞాన సాధనకు భక్తి, వైరగ్యం, తపస్సు, పఠనం, జపం లాంటి అనేక మార్గాలు ఉన్నాయని, వాటిల్లో సులభంగా ఫలితాన్నిచ్చేది భక్తి మార్గమన్నారు. ఈ కార్యక్రమంలో జగదీశ్వర్ ఆనందగిరిస్వామి, గురిజాల సోమిరెడ్డి, వెంకటేశ్వరరాజు, రవీందర్, సతీష్, వెంకటాచారి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రణవానందస్వామి

అనాథ పిల్లలకు చేయూత అందించాలి

తొర్రూరు: అనాథ పిల్లలకు చేయూత అందించాలని బాలవికాస ప్రోగాం మేనేజర్ లతా ప్రతాప్ తెలిపారు. బాలవికాస ఆధ్వర్యంలో ఆదివారం డివిజన్ కేంద్రంలోని లయన్స్ క్లబ్ భవనంలో అనాథ పిల్లల జన్మదిన వేడుకలు నిర్వహించారు. దాతల సహకారంతో అనాథ పిల్లలకు నిత్యావసర సరుకులు అందించారు. అనాథ పిల్లలు ఆత్మగౌరవంతో బతికేలా సమాజం సహకారం అందించాలన్నారు. కార్యక్రమంలో దాతలు ఎన్నమనేని శ్రీనివాసరావు, మాధవి, వెంకటేశ్వర్లు, బాలవికాస ప్రతినిధులు వై.రమ, ఎం.రమ, శైలజ, శోభ, సరిత, సుకన్య తదితరులు పాల్గొన్నారు.



వేడుకల్లో పాల్గొన్న బాల వికాస ప్రతినిధులు

చిన్ననాటి దోస్తులు కలిశారు..

- దశాబ్దాల తర్వాత ఒకే చోటుకి..
- నాటి జ్ఞాపకాలను నెమరేసుకున్న స్నేహితులు
- జిల్లాలో పలుచోట్ల పూర్వ విద్యార్థుల సమ్మేళనాలు

వారంతా దశాబ్దాల క్రితం కలిసి చదువుకున్నారు. పదో తరగతి పూర్తయ్యాక వేర్వేరు ప్రాంతాల్లో కొందరు ఉన్నత చదువులు అభ్యసించారు. మరికొందరు చదువు ఆపేసి కుటుంబాలకు ఆసరాగా ఉద్యోగ, ఉపాధి మార్గాలను వెతుక్కున్నారు. ప్రస్తుతం కుటుంబ పోషణకు ఏదో ఒక వృత్తిని చేస్తూ ముందుకెళ్తున్నారు. ఈక్రమంలో తమతోపాటు కలిసి చదువుకున్న మిత్రులను కలుసుకోవాలని నిర్ణయించుకున్నారు. ఇందుకోసం వారికి అనుకూలమైన ప్రదేశాల్లో ఆదివారం సమ్మేళనాలు ఏర్పాటు చేసుకుని ఆనందంగా గడిపారు.

మహబూబాబాద్ రూరల్ : మహబూబాబాద్ మండలంలోని కంబాలపల్లి మహాత్మాగాంధీ మెమోరియల్ పాఠశాలలో పదో తరగతి పూర్తి చేసుకున్న 1995– 96 బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆదివారం కలుసుకున్నారు. సుమారు ఇరవై తొమ్మిదేళ్ల తర్వాత నాటి మిత్రులను కలిసి విద్యార్థి దశలోని స్మృతులను గుర్తు చేసుకున్నారు. తమకు విద్యాబోధన చేసిన గురువులను సన్మానించి వారి ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు గోరుగంటి బిక్షపతిరావు, సోమ కృష్ణారెడ్డి, రామసహాయం శ్రీధర్ రెడ్డి, కోట సుధాకర్, మద్ది మాధవ్, బాతుక బుచ్చిరామయ్య, వెంకన్న, వెంకటరమణరెడ్డి, పద్మ, శంకర్, విద్యార్థులు ప్రసాద్, భాస్కర్, కిషన్, ప్రవీణ్, గోరె జానీ, శంకర్, అనిత, తార తదితరులు పాల్గొన్నారు.

బయ్యారం: మండలకేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో 1999– 2000 సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం చదువుకున్న పాఠశాలలో సమ్మేళనం నిర్వహించుకున్నారు. 25 సంవత్సరాల అనంతరం చదువున్న బడిలో కలిసిన బాల్యస్మృతులను గుర్తుకు చేసుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువును సన్మానించారు. గురువులు వెంకట్‌రెడ్డి, ప్రభాకర్, శ్రీధర్, వీరన్న, ప్రభాకర్‌రెడ్డి, రఘు, పూర్వవిద్యార్థులు మీరా, కోటి, కృష్ణ, పాష, భాస్కర్, ముత్యం, లక్ష్మీనారాయణ, హరీశ్ తదితరులు పాల్గొన్నారు.

35ఏళ్ల తర్వాత కలిశారు..

డోర్నకల్: స్థానిక జెడ్పీహెచ్‌ఎస్‌లో 1989–90 టెన్త్ బ్యాచ్ విద్యార్థులు ఆదివారం సమ్మేళనం ఏర్పాటు చేసుకున్నారు. 35 సంవత్సరాల తర్వాత దూరప్రాంతాల నుంచి వచ్చి తాము చదువుకున్న పాఠశాలలో కలిసి ఆనందంగా గడిపారు. నాడు చదువులు చెప్పిన గురువులను రైల్వే స్టేషన్ నుంచి జెడ్పీహెచ్ఎస్ వరకు ర్యాలీగా తోడ్కొని వచ్చి పాఠశాలలో ఘనంగా సన్మానించారు.



డోర్నకల్: సమ్మేళనంలో పాల్గొన్న నాటి గురువులు, పూర్వ విద్యార్థులు



మహబూబాబాద్ రూరల్‌లో..



బయ్యారం: గురువులతో పూర్వ విద్యార్థులు

సంక్షిప్త సమాచారం..

ఏర్పాట్ల పరిశీలన

మహబూబాబాద్ రూరల్ : జిల్లా కేంద్రంలో జరుగనున్న బొడ్రాయి (గ్రామ దేవత) ద్వితీయ వార్షికోత్సవ ఏర్పాట్లను ఎమ్మెల్యే భూక్యా మురళీనాయక్ ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మురళీనాయక్ మాట్లాడుతూ ఈ నెల 12వ తేదీన బొడ్రాయి ద్వితీయ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించేలా కమిటీ సభ్యులు చర్యలు తీసుకోవాలని సూచించారు.

కార్యవర్గం ఎన్నిక

కేసముద్రం: కేసముద్రం మున్సిపాలిటీలో కేసముద్రం పట్టణ మున్నూరు కాపు సంక్షేమ సంఘం 14వ వార్షికోత్సవ సర్వసభ్య సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆసంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సంఘం అధ్యక్షుడిగా ఆగె రాము, ఉపాధ్యక్షులుగా గుంజపొడుగు రాజశేఖర్, బనిషెట్టి సత్యనారాయణ, ప్రధానకార్యదర్శి గొట్టం సుభాష్, సహాయ కార్యదర్శి పూజల సతీష్, దబ్బేటి సంతోష్, కోశాధికారి పూజారి అమరేందర్‌ను ఎన్నుకున్నట్లు ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి చందాగోపి తెలిపారు.

రాములవారి తలంబ్రాల వడ్ల ఊరేగింపు

బయ్యారం: సీతారాముల కళ్యాణం సందర్భంగా ఉపయోగించే తలంబ్రాల వడ్లను ఆదివారం బయ్యారంలో ఊరేగింపుగా రామాలయానికి తీసుకెళ్లారు. రాజమండ్రి ప్రాంతం నుంచి తీసుకొచ్చిన వడ్లను గోటితో తలంబ్రాలు(బియ్యం) గా తయారు చేయనున్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు డాక్టర్ క్రిష్ణారెడ్డి, సభ్యులు వెంకటేశ్వరరావు, యాకూబ్‌రెడ్డి, మల్లయ్య, వెంకట్‌నారాయణ, శ్రీను, జంపయ్య, లింగయ్య పాల్గొన్నారు.

గరుడ వాహనంపై ఊరేగింపు

డోర్నకల్: స్థానిక వేంకటేశ్వరాలయంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం వెంకటేశ్వరస్వామిని గరుడ వాహనంపై ఊరేగించారు. వెంకటేశ్వరాలయం నుంచి మెయిన్‌రోడ్డు, రైల్వే స్టేషన్ మీదుగా గరుడ వాహన ఊరేగింపు కొనసాగింది. సాయంత్రం పురవీధుల్లో వెంకటేశ్వరస్వామి రథోత్సవం జరిగింది.

జయప్రదం చేయండి

బయ్యారం: ఈ నెల 15న బయ్యారంలో నిర్వహించనున్న సేవాలాల్ మహరాజ్ జయంతి ఉత్సవాలను జయప్రదం చేయాలని బంజారా నాయకులు పిలుపునిచ్చారు. ఆదివారం బయ్యారంలో నిర్వహించిన సమావేశంలో నాయకులు మాట్లాడారు. శ్రీకాంత్, రాము, శ్రీను, నాగు, రవి, ఏసు, గోపాల్, కోటేశ్వరరావు, రవీందర్ పాల్గొన్నారు.

శేషయ్య ఆశయాలు కొనసాగించాలి

డోర్నకల్: ప్రజా సమస్యల పరిష్కారంపై పోరాడిన కమ్యూనిస్టు తుమ్మ శేషయ్య ఆశయాలను నేటి యువత కొనసాగించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు శెట్టి వెంకన్న తెలిపారు. మండలంలోని పెరుమాళ్ల సంకీస గ్రామంలో సీపీఎం నాయకులు తుమ్మ శేషయ్య నాలుగో వర్ధంతిని ఆదివారం నిర్వహించగా.. నాయకులు బొబ్బ వెంకటరెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, కొర్ని, శ్రీను, మాల కొండయ్య పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్ఠపై సమావేశం

బయ్యారం: గుప్తనిధుల కోసం బయ్యారం పెద్దచెరువు కట్టపై కొన్ని నెలల క్రితం తవ్వకాలు జరిపిన కట్టమైసమ్మ విగ్రహం వద్ద తిరిగి విగ్రహ ప్రతిష్ఠపై ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో విగ్రహ ప్రతిష్ఠాపనకు ఈ నెల 21న పనులు ప్రారంభించాలని నిర్ణయించారు. సొసైటీ చైర్మన్ మధుకర్‌రెడ్డి, ముసలయ్య, ఐలయ్య పాల్గొన్నారు.

సామాజిక ఉద్యమాలకు పెద్దదిక్కు మంద కృష్ణ

తొర్రూరు: సామాజిక ఉద్యమాలకు పెద్దదిక్కు మంద కృష్ణ మాదిగ అని ఎంఈఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు సోమారపు ఐలయ్య అన్నారు. పద్మశ్రీ పురస్కారానికి ఎంపికై న మంద కృష్ణమాదిగను ఆదివారం హైదరాబాద్‌లో తొర్రూరు డివిజన్ ఎంఈఎఫ్ నాయకులు కలిసి సత్కరించారు. ఎంఈఓ మహంకాళి బుచ్చయ్య, నాయకులు కుంటకొమ్ము బిక్షపతి, తాటికాయల సురేందర్, నెమ్మది రాంబాబు, గుండాల రంజిత్, శంకర్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

తొర్రూరు రూరల్: సంక్షేమ హాస్టల్స్‌లోని సమస్యలను పరిష్కరించాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కన్వీనర్ పట్ల మధు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని చెర్లపాలెం గ్రామంలోని బీసీ హాస్టల్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా పట్ల మధు మాట్లాడుతూ హాస్టల్స్‌లోని అనేక సమస్యలు నెలకొని ఉన్నాయని, వాటిని పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేదం ఆందోళన కార్యక్రమాలను చేపడతామని హెచ్చరించారు. సంఘం నాయకులు నరసింహ, సుమంత్ పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థిని మరణం బాధాకరం

మరిపెడ రూరల్: సీరోలు ఏకలవ్య పాఠశాల వీడ్కోలు కార్యక్రమంలో ఈ నెల 4వ తేదీన డ్యాన్స్ చేస్తూ ఇంటర్ విద్యార్థిని సపావత్ రోజా మృతిచెందడం బాధాకరమని ప్రభుత్వ విప్ జాటోతు రాంచంద్రునాయక్ అన్నారు. ఆదివారం మండలంలోని వాల్యతండా గ్రామ పంచాయతీ పరిధిలోని సపావత్ తండాలో రోజా తల్లిదండ్రులను ఆయన పరామర్శించారు.

సుధాకర్‌రెడ్డి మృతి తీరనిలోటు

కురవి: ఎర్రంరెడ్డి సుధాకర్‌రెడ్డి మృతి నల్లెల్ల గ్రామానికి, మండలానికి తీరనిలోటని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే రాంచంద్రునాయక్ అన్నారు. నల్లెల్ల మాజీ సర్పంచ్, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు ఎర్రంరెడ్డి సుధాకర్‌రెడ్డి శనివారం మృతి చెందాడు. ఆదివారం రాంచంద్రునాయక్.. సుధాకర్‌రెడ్డి ఇంటికి వెళ్లి ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు.

మాజీ సర్పంచ్‌కు పరామర్శ

కురవి: మానుకోట మాజీ సర్పంచ్ భూక్య నెహ్రూనాయక్ తల్లి లక్ష్మీ ఇటీవల మండలంలోని నేరడ శివారు కాకులబోడు తండా శివారు కీమా తండాలో మృతి చెందింది. ఈ మేరకు ఎమ్మెల్సీ సత్యవతిరాథోడ్ ఆదివారం మాజీ సర్పంచ్ నెహ్రూనాయక్‌ను పరామర్శించారు.

క్రీడా విజేతలకు బహుమతుల ప్రదానం

చిన్నగూడూరు: సేవాలాల్ మహారాజ్ జయంతి ఉత్సవాలు, ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనాన్ని పురస్కరించుకుని మండలంలోని ఉగ్గంపల్లి మంచ్యాతండాలో నిర్వహించిన కబడ్డీ పోటీల్లో ఆదివారం విజేతలకు డోర్నకల్ మాజీ ఎమ్మెల్యే రెడ్యానాయక్ బహుమతులు ప్రదానం చేశారు. కబడ్డీ పురుషుల పోటీల్లో మొదటి బహుమతి (జెడ్పీహెచ్‌ఎస్ నర్సింహులపేట) రూ.8 వేలు, రెండో బహుమతి(జెడ్పీహెచ్‌ఎస్ బయ్యారం) రూ.6 వేలు నగదు అందజేయగా, కబడ్డీ మహిళల పోటీల్లో మొదటి బహుమతి(జెడ్పీహెచ్‌ఎస్ మరిపెడ) రూ.8 వేలు, రెండో బహుమతి(జెడ్పీహెచ్‌ఎస్ బయ్యారం) రూ.6 వేలు నగదును మాజీ ఎమ్మెల్యే రెడ్యానాయక్ విద్యార్థులకు అందజేశారు. అనంతరం ఆయన ఉద్యోగులతో కలిసి కాసేపు కబడ్డీ ఆడారు. కార్యక్రమంలో వివిధ శాఖల ఉద్యోగులు, మైనార్టీ జిల్లా నాయకులు ఆయూబ్‌పాషా, బీఆర్‌ఎస్ నాయకులు కొమిరెల్లి తదితరులు పాల్గొన్నారు.